కథ




# ఊహాకందని నిజం

గుమ్మళ్ళ ప్రసాదరావు

ఆ ఊరిలో డబ్బూ పరపతి ఉన్న వాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. అలా లెక్కపెట్టాలని అనుకుంటే ముందుగా చిటికన వేలు అన్నారావుగారిదవుతుంది.

అతనికి రైసు మిల్లు ఉంది. షుగర్ ఫ్యాక్టరీలో ఎనభై శాతం పెట్టుబడి ఉంది. ఇంకా ఎన్నో లావాదేవీలున్నాయి. సాంస్కృతిక సంఘాలకు విద్యా సంస్థలకు అతను మహారాజ పోషకుడు. లయన్సు క్లబ్బుకి అతను గత అయిదు సంవత్సరాలుగా అధ్యక్షుడు.

తాతలనాటి ఆస్తులేమీ సంక్రమించకపోయినా స్వశక్తితో ఇంత ఎత్తుకి చేరాడు. ముఖ్యమంత్రి అయినా, ఏ వి.ఐ.పి. అయినా ఆ జిల్లాకి వస్తే వేదిక మీద అన్నారావు గారు కూడా ఉండి తీరవలసిందే.

అతనెందరికో ఉపకారాలు చేశాడు. ఎందరికో ప్రభుత్వోద్యోగాలు వేయించాడు. 'ఛీ! ఒకరి మోచేతి కింద నీళ్ళు తాగుతామా?' అని అనుకునే వాళ్ళకు స్వతంత్రంగా బ్రతకండి అంటూ కోటాలు ఇప్పించాడు, లైసెన్సులు, కాంట్రాక్టులూ ఇప్పించాడు. 'మాకు ఉద్యోగా

లు అక్కరలేదు ఊళ్ళేలుతా' అని భీష్మించుకు కూర్చున్న వాళ్ళకు పురపాలక సంఘంలో కౌన్సిలర్ల దగ్గర నుంచి శాసనసభ సీట్ల వరకు ఇప్పించాడు.

అతను 'పరోపకారి'. అతను 'రాజనీతజ్ఞుడు'.

ప్రభుత్వాలను కూలద్రోయగలడు, ప్రభుత్వాలను నిలబెట్టగలడు. పందిని నంది చేయగలడు. అయినా అతను రాజకీయాలకు దూరంగా ఉండేవాడు. అతనిది దూరదృష్టి. తనవాళ్లు బాగుపడాలన్నదే అతని తాపత్రయం.

ఆశ్రిత పక్షపాతి అనే ఆరోపణ అతని మీద ఉంది. ఆరోపణలు అలాంటి పరపతిగలవారి మీద కాక పేరూ, ఊరూ లేని వారి మీద ఉండవు కదా? అతను దూషణ భూషణలకు అతీతుడు. అతను శిష్టరక్షణ చేసినా, చేయకపోయినా దుష్టశిక్షణ విధిగా చేసేవాడు.

అతన్ని చాలామంది గౌరవిస్తారు. అతనంటే చాలామంది అసూయపడతారు. కొందరు పరోక్షంగా చులకన చేస్తారు. అతను వేటినీ పట్టించుకోడు.

క్షీరసాగర మధనం ద్వారా లభ్యమైన అమృతాన్ని ఆ మహావిష్ణువు అసురులకు ఒక్క చుక్క కూడా లభించకుండా కేవలం సురులకే పంచినట్లు అన్నారావుగారు సకల సౌకర్యాలూ తనవారికే సంప్రాప్తించేలా చూసేవాడు. తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం లాంటిది, ఇంట గెలిచి రచ్చ గెలవాలనే నీతికి అతనెప్పుడూ కట్టుబడి ఉండేవాడు.

ఆధునిక జీవన వేగంలో ముందు, వెనుకలు తెలియవు గనుక, ఆగి, ఊపిరి పీల్చుకుని ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకోవడం ఆరోగ్యదాయకం. అతనంతే చేసేవాడు. వెనక్కు తిరిగి చూసి, 'అయ్యో! నా భార్య తమ్ముడు జులాయిలా తిరుగుతున్నాడు. వాడికి రోడ్ల నిర్మాణం కాంట్రాక్టు ఇప్పిస్తే నిలదొక్కుకుంటాడు' అని యోచించి, ఆ పుణ్యం కట్టుకున్నాడు. మేనమామ కొడుక్కి బ్యాంకు లోను ఇప్పించాడు. ఆ లోను కొంత కాలం తర్వాత మాఫీ చేయించాడు. ఒక కొడుకుని శాసన సభకు తోలేశాడు. మరో కొడుక్కి ప్రభుత్వ సారా దుకాణాలిప్పించాడు. అల్లుడికి సహకార సంఘం అధ్యక్ష పదవి ఇప్పించాడు.

అన్నారావు ప్లానింగు కమిషనుకు తీసిపోడు. పంచవర్ష ప్రణాళికలెప్పటికప్పుడు రూపొందిస్తూ ఉంటాడు. బిర్లా, టాటా, సింఘానియాల స్థాయికి ఎదగాలనేదే అతని లక్ష్యం అని అతని పరిచయస్తులు అభిప్రాయపడతారు.

ప్రమిదలోని దీపం కూడా విద్యుత్కాంతిలా ప్రకాశించాలని ఆశపడుతుంది. అలాంటిది మానవ మాత్రుడైన అన్నారావు తన అభివృద్ధిని కాంక్షిస్తున్నాడంటే అది అతని దోషం ఎందుకవుతుంది?

అతను జీవన వేగంలో ముందు వెనుకలు గుర్తించకుండా పరుగులు తీస్తూ, మధ్య మధ్య ఆగి, ఊపిరి పీల్చుకుని వెనక్కు తిరిగి, చూసుకునేవాడే కాని, తన దెంతటి అపూర్వ సేవో ఏనాడూ ఆలోచించలేదు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అని అనుకున్నాడు.

అంటే అతని కొక విషయం ఇదమిద్ధంగా తెలుసునన్నమాట.

దేనికైనా కాల పరిమితి ఉంటుంది. మనిషి జీవితానికీ అంతం ఉంటుంది.

నిన్నటి వరకు అతనికి ఊపిరి తీసుకోవడానికి సమయం దొరికేది కాదు. నేడు ఊపిరి తీసుకోవలసిన అవసరం కూడా లేకపోయింది. అప్పు డతను సజీవుడు. ఈనాడు మృత జీవి.

అంత చిన్నవయసులోనే అతనికి నూరేళ్లు నిండాయా? మరికొన్ని రోజులు జీవించి ఉంటే అతని షష్టిపూర్తి ఘనంగా జరిగి ఉండేది. అరవై సంవత్సరాలంత పెద్ద వయస్సా? ఈ దేశంలో తిండికీ, గుడ్డకూ దేచుకోకున్నా శతాధిక వత్సరాల వృద్ధులున్నారు, డెబ్బైయ్యోపడిలో మంత్రి పదవి బాధ్యతా ప్రమాణాలు చేసేవారున్నారు. రిటైరు అయినా పది పదిహేను సంవత్సరాలపాటు పింఛను తీసుకుంటున్న వాళ్లు ఉన్నారు. మరి అన్నారావుగారి నూకలు చెల్లిపోయాయి.

గొప్పవాడి చావు పెళ్లితో సమానం. అతని మృత శరీరాన్ని జనాల దర్శనం కోసం ఉంచారు. అబాల గోపాలం ఒక వింతను చూసినట్లు చూసిపోతున్నారు.

శవం చుట్టూ చాలామంది ఉన్నారు. అందులో స్త్రీలూ ఉన్నారు, పురుషులూ ఉన్నారు. ఆప్తులూ ఉన్నారు, పరిచయస్తులున్నారు.

సంతాప సభ ఎప్పుడో అయిపోయింది. ఏడుపులు స్తంభించిపోయాయి. శవ దహనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి ఒకపక్క.

వేరొకపక్క బంధు మిత్రులు సంభాషణల్లో పడ్డారు. రాజకీయాలు మొదలు ఇంటి విషయాల వరకు ముచ్చటించుకుంటున్నారు. కొందరు కాఫీలు సేవిస్తున్నారు, కొందరు సిగరెట్లు కాలుస్తున్నారు. తుళ్ళుతున్నారు, పేలుతున్నారు. వికవికలు పకపకలు. అన్నారావుగారు పరమ పదించారన్న దుఃఖం ఎవరి ముఖాల మీదా లేదు.

అలా సందడిగా పండుదినంలా వాళ్ళు ఉంటే, తులసివనంలో గంజాయిమొక్కలా ఒక్కడే ఒక్కడు కంటికి, మింటికి ఏకధారగా రోదిస్తూ నా కంటబడ్డాడు.

అతను అన్నారావుగారి కేమవుతాడు?

పుత్రుడా?

అల్లుడా?

చుట్టమా?

పక్షమా?

ఉపకారం పొందినవాడా?

ఉపకారం ఆశిస్తున్నవాడా?

అతని ఉనికినెవరూ పట్టించుకోవడం లేదు. అతన్ని ఎవరూ ఓదార్చడం లేదు.

అతని దుఃఖానికి హేతువేమిటి?

ఈ చావు వలన అత నెంతగా నష్టపోయాడు?

నా ఊహకందలేదు. అతన్ని చూస్తే జాలి వేసింది, ఓదార్చాలనిపించింది.

"పాపం! అన్నారావుగారు పోయారు" అన్నాను అతని చెంత చేరి.

"ఔను!" అతను ముక్తసరిగా జవాబిచ్చాడు.

"మీ దుఃఖం చూస్తూ ఉంటే నా కడుపు తరుక్కుపోతున్నది. మృత్యువుని ఆపడం మానవ శక్యం కాదు. ఏడవకండి, అతనికి నూకలు చెల్లిపోయాయి" అన్నాను.

అతను అంత దుఃఖంలోనూ తీక్షణంగా నా వంక చూశాడు.

"మీకతను అంతగా కావలసినవాడా?" అన్నాను.

మేఘాలైనా లేకుండా కుంభవృష్టి కురిస్తే నేనాశ్చర్యపోను. ఒక వ్యక్తి చావుకి అంతగా కట్టలు తెంచుకు దుఃఖిస్తూ ఉంటే నేను ఆశ్చర్యపోయాను.

అతను మళ్ళీ బావురుమన్నాడు. నన్ను కావలించుకున్నాడు.

"అడిగారు కాబట్టి చెపుతున్నాను. అతను నా కేం కాకపోయాడే అని ఏడుస్తున్నాను. అతనికి నేనూ ఒక బంధువునై ఉంటే నేనూ వీళ్లలా తుళ్ళుతూ ఉండేవాడిని. ఈ కారణం చాలా రోదించడానికి?" అతను నన్నే ప్రశ్నించాడు.

★

**సులువైన మార్గం [జోక్స్]**

"బ్రతుకు మీద విరక్తి కలిగి చనిపోవాలని ఉంది, చూస్తూ - చూస్తూ ఆత్మహత్య చేసుకోలేకపోతున్నాను. సులువైన మార్గమొకటి చెప్పండి?" డాక్టర్ని అడిగాడు.

"ప్రముఖ నాయకుల నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచెయ్యి. సులువైన మార్గం వాళ్ళే చూపిస్తారు". చెప్పారు డాక్టరుగారు.

చెరుకూరి నాగేంద్రయ్య [విజయవాడ]




## రచనలకు ఆహ్వానం

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధానికి కథలు, విశేషవ్యాసాలు, కార్టూన్లు, జోకులు, ఫోటోలు, పాఠకులను అలరించే వైవిధ్యం ఉన్న అంశాలను ఆహ్వానిస్తున్నాం. ప్రచురణార్హమైన వాటిని వీలువెంబడి ప్రచురిస్తాం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. ప్రచురణార్హంకాని రచనలు తిప్పి పంపగోరు వారు తగినన్ని స్టాంపులు అంటించిన కవర్లను జతపరచాలి. రచనలు వగైరా మీ సొంతమేనన్న హామీ పత్రం స్పష్టంగా ఉండాలి.

చిరునామా: ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం
ఎక్స్‌ప్రెస్ కాంపౌండ్
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029